క్లుప్తంగా

కూటమి దగాకు చెంపపెట్టు



నౌడు వెంకటరమణ

సాక్షి, భీమవరం: కూటమి దగాకోరు పాలనపై ఏడాది కాలంగా ప్రజల్లో గూడు కట్టుకున్న వ్యతిరేకతకు 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి వచ్చిన అనూహ్య స్పందనే నిదర్శనమని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల హామీలను విస్మరించి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను తీవ్రంగా వంచించారన్నారు. అన్ని వర్గాల వారు కూటమి పాలనపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారని ఆయన తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు వెల్లువలా తరలివచ్చి చంద్రబాబు సర్కారుకు వ్యతిరేకంగా తమ నిరసన గళం వినిపించారన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినం సూపర్ సక్సెస్ అయ్యిందని, అందుకు సహకరించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు నౌడు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు.

మావుళ్లమ్మ సేవలో సినీనటి అనన్య నాగళ్ల



అనన్య నాగళ్లను ఆశీర్వదిస్తున్న పండితులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మావుళ్ళమ్మ అమ్మవారిని గురువారం సినీనటి అనన్య నాగళ్ల దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనం ప్రసాదాలు అందించారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహప్రతిష్ఠ



సీసలిలో ప్రతిష్ఠించిన పోలేరమ్మ విగ్రహం

కాళ్ల: గ్రామదేవత పోలేరమ్మ నామ స్మరణతో సీసలి గ్రామం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. శ్రీపోలేరమ్మ, శ్రీపోతురాజు ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా ఆలయంలో రాతి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. వైదిక కార్యక్రమాల అనంతరం బ్రహ్మశ్రీ ఎం.శ్రీనివాస సిద్ధాంతి (స్థపతి) పర్యవేక్షణలో వేద పండితులు విగ్రహాలను ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా యాగశాలలో గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామదేవత విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాలనుంచి వేలాదిగా వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, జుత్తుగ నాగరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీఅన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కట్రెడ్డి సురేష్ కుమార్, నూకల భోగేంద్ర బాబు, వాస్కూరి శ్రీనివాసరావు, తోట రామదాసు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



భీమవరంలో శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భీమవరం: మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసు శాఖ అభివృద్ధి చేసిన శక్తి మొబైల్ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చునని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీషా తెలిపారు. శక్తి యాప్‌పై అవగాహనలో భాగంగా గురువారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అవాహన కల్పించారు. శక్తి బృందాలు భీమవరంలోని స్థానిక పాసుపోర్టు కార్యాలయం, ఓల్డ్ బస్ స్టేషన్, మావుళ్ళమ్మ గుడి సెంటర్, అదేవిధంగా జిల్లాలోని పాలకొల్లు రూరల్, తాడేపల్లిగూడెం రూరల్ , తాడేపల్లి గూడెం టౌన్, పాలకొల్లు టౌన్, పోడూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, ప్రముఖ షాపింగ్ మాల్స్, మూవీ థియేటర్స్‌లో అవగాహన కల్పించారు.

నేటితో ముగియనున్న వేసవి విజ్ఞాన శిబిరం

భీమవరం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా భీమవరం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు క్విజ్, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగుస్తుందని తెలిపారు. కాబట్టి వివిధ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ జి.శ్యామ్, వి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థ నీటితో పర్యావరణానికి పెనుముప్పు

పరిశ్రమల నుంచి నేరుగా కాలువల్లోకి వదిలేస్తున్న వైనం

కాళ్ల: రొయ్యల చెరువుల పరిశ్రమల లెక్కలేనితనం వల్ల పర్యావరణానికి పెద్ద ముప్పు వస్తుందని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చాలా రొయ్యల పరిశ్రమల్లో వచ్చే వ్యర్థ నీటిని నిబంధనలకు విరుద్ధంగా నేరుగా కాలువల్లోకి వదిలేస్తున్నారు. దీంతో కాలువల్లో వ్యర్థ నీటితో నిండిపోయి తెట్టులుగా తేలి ముక్కుపుట్టలు అదిరేలా దుర్గంధం వెదజల్లుతుంది. అందువల్ల ఆ రహదారి వెంబడి ప్రయాణించాలంటేనే ముక్కులు మూసుకుని ప్రయాణించాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. రొయ్యల పరిశ్రమలను ఆనుకుని పాఠశాలలు, దేవాలయాలు, ప్రజలు నివాసం ఉంటున్నా దుర్వాసన వస్తుందని చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీసలి నుంచి పెదఅమిరం వరకు ఇంతే

మండలంలోని సీసలి గ్రామం నుండి భీమవరం వైపు పెదఅమిరం వరకు రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఆక్వా పరిశ్రమలు ఉన్నాయి. అయితే సీసలి గ్రామ పరిధిలో రాష్ట్రీయ రహదారిని అనుకుని సాయిబాబా ఆలయం ఉంది. ఆలయానికి ప్రతిరోజుతో పాటు గురువారం ప్రత్యేకంగా పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అయితే పరిశ్రమల నుంచి వచ్చేవ్యర్థ నీటిని రీసైక్లింగ్ చేయకుండా కాలువల్లో వదిలేయడంతో ఆ నీరు దుర్వాసన వచ్చి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా కోపల్లె, పెదఅమీరం గ్రామ పరిధిలో ఆక్వా వ్యర్థాలతో స్థానిక ప్రజలతో పాటు గ్రామ పరిధిలో ఒక ప్రైవేట్ స్కూలు ఉండటంతో విద్యార్థులు ప్రజలు దుర్వాసనకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని భయాందోళనకు గురవుతున్నారు. వ్యర్థ నీటి వల్ల వచ్చే దుర్వాసనతో చర్మ వ్యాధులు, శ్వాసకోస వ్యాధులు వచ్చే ఆకాశం ఉందని పలువురు చెబుతున్నారు.



పెద అమిరం అభ్యాస్ స్కూల్ ఎదురుగా కాలువపై తేలిన పరిశ్రమల నుండి వచ్చిన వ్యర్థ నీటి తెట్టు



సీసలి సాయి బాబా ఆలయానికి ఎదురుగా పరిశ్రమల నుంచి నేరుగా బయటికి వదిలేస్తున్న వ్యర్థాలు

నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు

నిబంధనలు పాటించకపోవడం వల్ల ఇప్పటికే పంట, మురుగు కాలువలు పాడైపోయాయి. పెద అమిరం గ్రామంలో జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే నివాసం ఉంటున్నారు. అయినా కూడా ఈ పరిస్థితి ఉండటంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత దుర్వాసన వచ్చి ప్రయాణికులు, వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత శాఖ అధికారులు గాని గ్రామస్థాయి అధికారులు గాని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితులు మారాలంటే జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిత్యం దుర్గంధం

సీసలి నుంచి పెద అమీరం వరకు ప్రయాణించాలంటే ముక్కు మూసుకుని ప్రయాణించాల్సి వస్తుంది. నిత్యం దుర్గంధం వెదజల్లుతుంది. దీనివల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అధికారులు పట్టించుకుని కఠిన చర్యలు తీసుకోవాలి.



– టి.నరేష్, ప్రయాణికుడు

ముక్కు మూసుకుని ప్రయాణిస్తున్నాం.

పెదఅమిరం నుంచి సిసలి వరకు ప్రయాణం చేయాలంటే ముక్కు మూసుకుని ప్రయాణించాల్సి వస్తుంది. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. దుర్వాసన వల్ల అటువైపు వెళ్లాలంటేనే చికాకు వస్తుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.



– కిషోర్, వాహనదారుడు

ఎన్‌హెచ్ రోడ్డు కోసం భూసేకరణ

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో భూ సేకరణ కార్యక్రమం ప్రారంభమైందని ఇన్‌చార్జి తహసీల్దార్ ఫరూక్ గురువారం విలేకరులకు తెలిపారు. సర్వే నంబర్ 2131 నుంచి సర్వే నెంబర్ 2181(ఈ)లలో భూ సేకరణకు గెజిట్ జారీ చేశారని తెలిపారు. ఈ గెజిట్ అన్ని దినపత్రికల్లో మే 22న ప్రచురితమైందన్నారు. ప్రచురించిన రోజు నుంచి 21 రోజుల్లోపు అభ్యంతరాలుంటే ఉంటే భూసేకరణ అధికారి, జాయింట్ కలెక్టర్‌కు ఈ నెల 14లోపు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

ఉండి: అధికారం కోసం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు విమర్శించారు. గురువారం ఉండి జంగాల కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీ శాఖ నూతన కార్యవర్గాన్ని జిల్లా సమితి సభ్యుడు సనపల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. కార్యదర్శిగా వీరన్నపల్లి పెద్దులు, సహాయ కార్యదర్శిగా కళ్యాణి సత్యనారాయణ, సభ్యులుగా పలువురు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా గత ప్రభుత్వంపై విమర్శలు చేసి తాము అధికారంలోకి వస్తే మరిన్ని మంచి సంక్షేమ కార్యక్రమాలు చేస్తామని వాగ్దానాలు గుప్పించి ఇప్పుడు మాట తప్పారని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు సీతారాంప్రసాద్ మాట్లాడుతూ జంగాల కాలనీలో కనీసం మౌలిక సదుపాయాలు లేవని విమర్శించారు. కార్యక్రమంలో తమరాని శ్రీనివాస్, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉండి సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

భీమవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భీమవరం 2వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెండో అదనపు మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి, రెండో అదనపు రెండో తరగతి మేజిస్ట్రేట్ నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, సంయుక్త కార్యదర్శి జవ్వాది సత్తిబాబు, ఏజీపీ వరప్రసాద్, న్యాయవాదులు మోగంటి శివకృష్ణ, వీవీ.సుబ్బారావు పాల్గొన్నారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భీమవరం బీవీ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విష్ణు ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటినట్లు కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు చెప్పారు. అలాగే పట్టణంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల్లో మొక్కలునాటారు. ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన ఆధ్వర్యంలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.అరవిందస్వామి, ఎల్.నర్సింహరావు, కాకుమాని శ్రీనివాసరావు, ఎస్ లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు. యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీ కథారీ నగర్‌లో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)తో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ చైర్మన్ మట్లపూడి సత్యనారాయణ; దిరిశాల సత్యారాయణ, బోణం పాండురంగారావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల ఆవరణలో మొక్కలునాటినట్లు ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నేటి రవీంద్ర చెప్పారు. జిల్లాలో విశాలమైన ఆవరణలు కలిగిన 25 స్కూల్స్ ఆవరణలో మామిడి, సపోటా, జామ, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి వంటి మొక్కలు నాటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లాంట్ మేనేజర్ జె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భీమవరం: రెండో అదనపు మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



ఆకివీడు: గ్రంథాలయం వద్ద మొక్కలు నాటుతున్న చిన్నారులు

పర్యావరణ పరిరక్షణఅందిరి బాధ్యత

ఆకివీడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానికంగా పలు చోట్ల పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మొక్కలు నాటారు. స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద, నగర పంచాయతీ వద్ద, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్, ఉపాధ్యాయుడు విక్రమ్ పాల్గొన్నారు. శాఖ గ్రంథాలయంలో దాత కుంపట్ల విజయ్ సాగర్‌ఆర్థిక సహకారంతో మొక్కలను నాటారు.

మొక్కలే మనిషికి ప్రాణవాయువు

భీమవరం (ప్రకాశంచౌక్): మొక్కలు పెంపకంతో పచ్చదనం కాలుష్యం తగ్గడం ప్రాణవాయువు వృద్ధి చెందుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ పి సత్యనారాయణ మూర్తి అన్నారు. భీమవరం ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం డిపో ఆవరణలో మొక్కలను నాటారు. డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మొక్కలే మనిషికి ప్రాణవాయువు అని, ప్రతిఒక్కరూ విధిగా బాధ్యతగా ఒక మొక్కనైనా నాటాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, యూనియన్ నాయకులు వైవీ రావు, ఎస్.రమేష్ బాబు, పి.సోమరాజు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటారు. అనంతరం వైద్యాధికారి సునీల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పెరటిలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని వివరించరు. ప్లాస్టిక్ వాడకం నివారించి క్యాన్సర్ వ్యాధిని అరికట్టలని చెప్పారు. సీహెచ్‌ఓ డి.విజయవతి, పీహెచ్‌సీ వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలకోడేరు మండల తహసీల్దారు నడింపల్లిభారతి విజయలక్ష్మి గురువారం కార్యాలయ పరిసరాలు శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలోని సమతుల్యతను మొక్కలు పరిరక్షిస్తాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు ఆదిశేషయ్య, రఘు, ఆర్ఐ రాఘవరాజు, ఏఎస్ఓ గోపాల కృష్ణంరాజు పాల్గొన్నారు.



భీమవరం (ప్రకాశంచౌక్): ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



కాళ్ల: ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటుతున్న వైద్యుల సునీల్



పాలకోడేరు: మొక్కలు నాటుతున్న తహ సిల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి

మట్టిని అక్రమంగా తోలేస్తున్నా పట్టించుకోరా?



యనమదుర్రు సమీపంలో పంటకాలువ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డువైపు మట్టిని తీసిన దృశ్యం



సొంత స్థలంలో మట్టిని పూడ్చుకుంటున్న జనసేన నాయకుడు

భీమవరం అర్బన్: పట్టణంలోని దిరుసుమర్రు రోడ్డులోనికి జీ అండ్ వీ కెనాల్ లాకుల వద్ద నుంచి దిరుసుమర్రు వరకు ఛానల్‌లో రూ. 14 లక్షలతో మట్టి పూడిక తీత పనులను ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. అయితే ఛానల్ ఇరువైపుల పేరుకుపోయిన సిల్టును పొక్లెయిన్‌ల సహాయంతో ఇరువైపులా వేశారు. అయితే ఆర్ అండ్ బీ రోడ్డు పక్కన వేసిన మట్టిని యనమదుర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు తన సొంత స్థలంలో జేసీబీ, మట్టి ట్రాక్టర్లతో పూడ్చుకుంటున్నారు. బయటకు తీసిన మట్టిని ఛానల్ ఆవలివైపు ఉన్న యనమదుర్రు డ్రైయిన్ పటిష్టకు వినియోగిస్తే బాగుండేదని పలువురు రైతులు చెబుతున్నారు. ప్రతి ఏటా అదే ప్రాంతంలో యనమదుర్రు డ్రెయిన్‌కు వరద పోటు వచ్చినప్పుడు లక్షలాది రూపాయలు వెచ్చించి దూరప్రాంతాల నుంచి ట్రాక్టర్లపై వందలాది మట్టి బస్తాలతో యనమదుర్రు కరకట్టను పటిష్టం చేస్తారు. ఇరిగేషన్ అధికారులు ప్రస్తుతం తీసిన మట్టిని ఒకచోట వేస్తే వర్షాకాలంలో మట్టిబస్తాలకు, యనమదుర్రు డ్రెయిన్ కరకట్టకు పటిష్ఠకు ఉపయోగపడుతుందని పలువురు రైతులు చెబుతున్నారు. జేసీబీతో మట్టి తీసేటప్పుడు ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ సిబ్బంది లేకపోవడంతో ఇష్టానుసరంగా తీసివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈఈ వినయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఆర్‌అండ్‌బీ రోడ్డు వైపు మట్టి వల్ల వాహనాలు జారిపడిపోతాయని ప్రజాప్రతినిధి తీసి వేయమన్నారని తీసేస్తున్నామని చెప్పడం గమనార్హం.

ఉత్సాహంగా ఇన్విటేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్



ఇన్విటేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

భీమవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో గురువారం భీమవరం పట్టణంలోని ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో ఇన్విటేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనసూయ చెస్ అకాడమీ కోచ్ మాదాసు కిషోర్ మాట్లాడుతూ టోర్నమెంట్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు అండర్ ఫైవ్, అండర్ సెవెన్, అండర్ నైన్, అండర్ 11, అండర్ 13, అండర్ 15, చిన్నారులకు ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన క్రీడాకారులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గమిని రవిపవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, సురేష్ జైన్, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: స్థానిక బుధవారం మార్కెట్ విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓప్రకటన విడుదల చేశారు. నరసయ్య అగ్రహారం, అల్లూరి సీతా రామరాజు బొమ్మ ఏరియా, కుముదవల్లి రోడ్ బుధవారం మార్కెట్, కొత్త బస్టాండ్ ఏరియా, మెంటే వారి తోట, కళాభవన్, సీపీఎం ఆఫీస్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాద బాధితుడి మృతి

ఉండి: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 3వ తేదీన ఉండి శివారు రామాపురం టర్నింగ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సప్పా సుబ్రహ్మణ్యం(42) అనే వ్యక్తి భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతున్న బాధితుడు గురువారం ఆసుపత్రిలో మృతి చెందడంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు స్పష్టం చేశారు.

పేకాడుతున్న పది మంది అరెస్ట్

భీమవరం: స్థానిక లూథరన్ హైస్కూల్లో పేకాడుతున్న 10 మందిని గురువారం అరెస్ట్ చేశామని వన్‌టౌన్ పోలీసులు విలేకరులకు తెలిపారు. నిందితుల నుంచి రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్సై కృష్ణాజి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

తెనాలిలో దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

భీమవరం అర్బన్: ఇటీవల తెనాలి పట్టణంలో దళిత, మైనార్టీ యువకులపై నడిరోడ్డుపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకుని వారిని సస్పెండ్ చేయాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని డేగాపురం గ్రామంలో గురువారం దళిత ఐక్య వేదిక భీమవరం మండల శాఖ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ తెనాలిలో నడిరోడ్డుపై దళిత, మైనార్టీ యువకులపై లాఠీలతో కొట్టడం అనేది హీరోయిజం కాదని రౌడీయిజం అవుతుందని అన్నారు. తెనాలిలో పోలీసుల చర్య మానవ హక్కుల ఉల్లంఘననేనని గంటా సుందర్ కుమార్ ఆరోపించారు. సమావేశంలో బట్టు సతీష్, అంబటి ఆనంద్ కుమార్, ఎస్ మోజెస్, కర్ర కల్యాణ్, టి.శుభాకర్, కె.యేషయ్యా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అంటే ఇదేనా?



పొక్లెయిన్ తో మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి పర్యావరణ సమతుల్యతను కాపాడండి అని ఉన్నతాధికారులు వర్షాకాలం సమీపించగానే వనం-మనం కార్యక్రమం ద్వారా లక్షలాది మొక్కలు నాటుతున్నారు. అయితే ఎండాకాలంలో ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారుల సమన్వయ లోపంతో మొలిచిన మొక్కలను ప్రొక్లెయిన్ సహాయంతో పీకేస్తున్నారు. మండలంలోని ఎల్‌జీజీ ఛానల్ ఆనుకుని వందలాది మొక్కలను ఎంతో వ్యయంతో వనం-మనం కార్యక్రమం ద్వారా నాటారు. అయితే ఇటీవల గొల్లివాని తిప్ప నుంచి కొత్తపూసలమర్రు శివారు వరకు ఎల్‌జీ పాడు ఛానల్‌లో రూ. 12 లక్షలతో పూడిక పనులను ప్రొక్లెయిన్‌లతో తీస్తున్నారు. పక్కనే ఉన్న మొక్కలను పర్యావరణ దినోత్సవం రోజున తొలగించడంపై అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

భీమవరం: ఉద్యోగ, కార్మిక వర్గాలకు నష్టం కలిగించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని జూలై 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మె విజయవంతం చేయడానికి దశల వారి కార్యక్రమాలను నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కమిటీ నిర్ణయించింది. గురువారం భీమవరం పట్టణం యుటిఎఫ్ కార్యాలయంలో జెఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ గత నెలలో జరగాల్సిన సమ్మె ఆపరేషన్ సింధూర్ వల్ల వాయిదా వేసి జూలై 9న జరపాలని నిర్ణయించినట్లు చెప్పారు. చింతకాయల బాబురావు, పీవీ ప్రతాప్, కె.నాగేశ్వరరావు, ఎస్.రంగారావు, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.